సాక్షి విశాఖపట్నం

సోమవారం । 22 । జనవరి । 2024



సిరిపురం జంక్షన్‌లో అభివృద్ధి చేసిన వైజాగ్ స్క్వేర్



ఉజ్వల విశాఖ.. నవ పతాక

అభివృద్ధి అంటే..
ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం..
ఊరూ వాడల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం.. సగటు వ్యక్తి చెంతకు పరిపాలన వ్యవస్థను తీసుకురావడం.. ఆహ్లాదాన్ని పంచడం.. ఆనందాన్ని అందించడం.. ఉపాధి అవకాశాలు కల్పించడం.. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడం.. ప్రతి ఒక్కరూ సామాజికంగా.. ఆర్థికంగా ఎదగడం. ఇవన్నీ స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా నెరవేరలేదు. ఇకపై నెరవేరవని అనుకున్నారంతా! కానీ.. కాలం మారింది. పాలకులు మారారు. వ్యవస్థలో మార్పు వచ్చింది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన సాగింది. నాలుగున్నరేళ్లలో విశాఖపట్నంలో అద్భుతాలు జరిగాయి. పనికెళ్లిన పిల్లాడు.. బడికెళ్లాడు. చదువు ఆపేద్దామని అనుకున్న పేద విద్యార్థి.. కాలేజీల్లో ఇంటర్న్‌షిప్‌లు చేస్తున్నాడు. వలస వెళ్లిన నిరుద్యోగి.. దర్జాగా సొంతూరికి సమీపంలోనే ఉపాధి పొందాడు. విత్తు, ఎరువు కోసం బరువైన హృదయంతో ఎదురు చూసే రైతు చెంతకే.. అన్నీ చేరాయి. వ్యవసాయం పండగలా మారింది. కునారిల్లిన ఐటీ పరిశ్రమ.. కొత్త పుంతలు తొక్కుతోంది. అభివృద్ధికి నోచుకోని రహదారులు.. అద్దంలా మెరుస్తున్నాయి. ప్రతి కోణంలోనూ సాగరాన్ని మించేలా విశాఖ పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి కెరటాలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి.

- సాక్షి, విశాఖపట్నం

విశాఖ పార్లమెంట్ పరిధిలో జరిగిన అభివృద్ధి

- 2014–19 వరకూ టీడీపీ చేసిన ఖర్చు- రూ.1450 కోట్లు
- టీడీపీ ఐదేళ్ల హయాంలో చేపట్టిన పనులు- 4,450
- 2019–2023 వరకూ వైఎస్సార్‌సీపీ చేసిన ఖర్చు- రూ.2,490 కోట్లు
- వైఎస్సార్‌సీపీ హయాంలో నాలుగేళ్ల కాలంలో చేపట్టిన పనులు- 9,920

ఆరు నియోజకవర్గాల పరిధిలో రహదారి పనులు

- మంజూరు చేసినవి- 2,089
- కేటాయించిన నిధులు- రూ.547.45 కోట్లు
- పూర్తయిన పనులు- 1,216
- ఖర్చు చేసిన నిధులు- రూ.202.59 కోట్లు
- కొనసాగుతున్న పనులు- 873
- ఖర్చు చేస్తున్న నిధులు- రూ.344.86 కోట్లు

అభివృద్ధి పరవళ్లు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా జిల్లా అభివృద్ధికి కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ సంయుక్తంగా కార్యచరణ రూపొందించారు. బెస్త గ్రామంగా ఉన్న ఊరు.. మహానగరంగా మారగా.. ఇప్పుడు దాని ఖ్యాతిని అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లింది మాత్రం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే. నగర అభివృద్ధిపై సీఎం జగన్ ప్రత్యేకంగా ఫోకస్ చేయడంతో.. నాలుగేళ్లలో రూ.వేల కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి.



పశ్చిమ, ఉత్తర, తూర్పు నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలున్నప్పటికీ.. రాజకీయాలకు తావులేకుండా.. ప్రతి ఒక్క నియోజకవర్గాన్ని ప్రభుత్వం సమానంగానే అభివృద్ధి చేసింది.

సొంతింటి కల నెరవేర్చారు



- టిడ్కో ఇళ్లను టీడీపీ హయాంలో పునాదులకే పరిమితం చేయగా.. వాటిని నిర్మించే బాధ్యత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకుంది. విశాఖ పార్లమెంట్ పరిధిలో 20 వేల ఇళ్ల నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇప్పటికే 50 శాతం ఇళ్లల్లో పేద ప్రజలు గృహ ప్రవేశం చేశారు.
- కోర్టు కేసుల కారణంగా.. విశాఖ పరిధిలో జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణం రాష్ట్రంతో పోలిస్తే ఆలస్యంగా మొదలైనా.. చురుగ్గా నిర్మాణ పనులు సాగాయి. మొత్తం 1.92 లక్షల మంది సొంతింటి కల నెరవేర్చేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాలనీలను నిర్మిస్తోంది. ఇప్పటికే 50 వేలకు పైగా కుటుంబాలు తమ సొంత ఇంటిలో ఆనందంగా జీవనం సాగిస్తుండటం విశేషం.

కొత్త కొత్తగా పర్యాటకం

- సువిశాల సాగరతీరం మణిహారంగా ఉన్న విశాఖలో.. పర్యాటకులను మరింత ఆకర్షించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 11 కొత్త బీచ్‌లను అభివృద్ధి చేసింది. ఈ 11 బీచ్‌లను అనుసంధానిస్తూ.. కోస్టల్ బీచ్ మాస్టర్ ప్లాన్‌లో జిల్లాలో 25 బీచ్‌లు అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధమైంది. విజయవాడలోని ఫిషరీస్ యూనివర్సిటీ నేతృత్వంలో దీనికి సంబంధించిన సర్వే కూడా పూర్తయింది.
- నిత్యం వేలాది మందితో కిటకిటలాడే



బీచ్‌లను పరిశుభ్రంగా ఉంచేందుకు రూ.12.55 కోట్లతో మొత్తం ఆరు బీచ్ క్లీనింగ్ యంత్రాలను సిద్ధం చేసింది. ఎప్పటికప్పుడు బీచ్‌ల్లో పేరుకు పోయిన చెత్తను ఏరివేస్తున్నారు.

జీవీఎంసీ అభివృద్ధి చేసిన పార్కులు

పార్కు పేరు	పార్కు ఉన్న ప్రదేశం	ఖర్చు చేసిన వ్యయం
జీవీఎంసీ థీమ్ పార్క్	ఎంఎస్సార్ లే అవుట్	రూ.1.94 కోట్లు
యోగా, మెడిటేషన్ థీమ్ పార్క్	పీఎంపాలెం లాస్ట్ బస్టాప్	రూ.1.92 కోట్లు
స్పోర్ట్స్ థీమ్ పార్క్	బక్కన్నపాలెం	రూ.1.95 కోట్లు
పామ్ గార్డెన్స్ థీమ్ పార్క్	వైఎల్పీ లేఅవుట్, ఎండాడ	రూ.1.34 కోట్లు
శివాజీ పార్క్	శివాజీ పాలెం	రూ.1.53 కోట్లు
ఎంవీపీ సెక్టార్–11 పార్క్	ఎంవీపీ సెక్టార్–11	రూ.1.12 కోట్లు
స్పోర్ట్స్ థీమ్ పార్క్	సుజాతనగర్	రూ.1.78 కోట్లు
ఏపీహెచ్‌బీ కాలనీ పార్క్	గాజువాక	రూ.4.90 కోట్లు



రెండింతల అభివృద్ధి

జీవీఎంసీ పరిధిలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోని ఐదేళ్ల కాలంలో అంటే 2014 నుంచి 2019 వరకు మొత్తం 4,450 పనులకుగానూ రూ.1,450 కోట్లను మాత్రమే ఖర్చు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 నుంచి ఇప్పటివరకు నాలుగున్నరేళ్ల కాలంలో 9,920 పనులను చేపట్టింది. ఇందుకోసం రూ. 2,490 కోట్ల మేర వ్యయం చేసింది. వీటితో పాటు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకుగానూ మరో రూ. 66 కోట్ల మేర వ్యయం చేసింది. ఈ నిధుల కింద 708 పనులను చేపడుతోంది. అంటే నాలుగున్నరేళ్ల కాలంలో జీవీఎంసీ పరిధిలో ఏకంగా రూ.2,556 కోట్ల మేర నిధులను వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందన్నమాట. ఫలితంగా నగర రూపురేఖలు మారిపోయాయి.

తళుక్కుమనేలా రహదారులు.. జంక్షన్లు

- 2019 నుంచి ఇప్పటి వరకు రూ.547.45 కోట్లతో 2,089 రహదారి పనులు మంజూరు కాగా.. ఇప్పటికే రూ.202.59 కోట్లతో 1,216 పనులు పూర్తయ్యాయి. మరో రూ.344.86 కోట్లతో 873 పనులు జరుగుతున్నాయి.
- 15 ఏళ్లుగా రహదారి సౌకర్యానికి నోచుకోని ప్రాంతాలకు సైతం రోడ్లు వేశారు.
- వివిధ ఫండ్స్ కింద వచ్చిన నిధులతో రూ.104 కోట్లతో 27 కి.మీ మేర రోడ్లు, జంక్షన్ల అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయి.




- అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రయాణికులు సేదతీరేందుకు అధునాతన బస్ బేలు ఏర్పాటు చేశారు. మొత్తం రూ.462.70 లక్షలతో 20 బస్ బేలు నిర్మించారు. కూడళ్లను అభివృద్ధి చేశారు.

పార్కుల్లో కొత్తందాలు



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన పార్కుల తర్వాత వాటి రూపురేఖలను మార్చివేసింది. నగరవాసులు వ్యాయామం చేసుకునేందుకు వీలుగా ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసింది. ఈ విధంగా మొత్తం 103 పనులను చేపట్టి... ఇందుకోసం రూ. 50 కోట్ల మేర వెచ్చించింది. గతంలో కనీసం కన్నెత్తి చూసేందుకు వీలు లేకుండా ఉన్న శివాజీ పార్కు రూ.1.53 కోట్లతో కొత్తందాలను సంతరించుకుంది. సిరిపురం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన వైజాగ్ స్క్వేర్ నగరానికి స్పెషల్ అట్రాక్షన్‌గా మారింది. నగరంలోని ప్రతి పార్కు ఒక బ్రాండ్ ఇమేజ్‌కు డెస్టినీగా మారింది. మరో రూ.16 కోట్లతో 8 పార్కుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.

ఇది కదా అభివృద్ధి



- రూ.150 కోట్ల వ్యయంతో ఎన్ఏడీ ఫ్లైఓవర్‌ను పూర్తి చేసింది.
- జగదాంబ జంక్షన్‌లో పార్కింగ్ కష్టాలకు చెక్ చెబుతూ రూ.11.45 కోట్లతో దేశంలోనే తొలి మెకనైజ్డ్ ఆటోమేటిక్ పార్కింగ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసింది.
- వీఎంఆర్‌డీఏ ఉద్యోగ భవన్ ఎదురుగా ఉన్న 1.35 ఎకరాల్లో రూ.67.57కోట్లతో ఎంఎల్‌సీపీ ప్రాజెక్టు పనులు సాగుతున్నాయి.
- రూ.7.5 కోట్లతో బీచ్‌రోడ్ పర్యాటకానికి తలమానికంగా సీహారియర్ మ్యూజియంని వీఎంఆర్‌డీఏ నిర్మించింది.
- రూ.14 వేల కోట్లతో లైట్ మెట్రో ప్రాజెక్టు డీపీఆర్‌కు రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేయగా.. రెండురోజుల్లో కేంద్రానికి డీపీఆర్‌ను సమర్పించనున్నారు.

బీచ్ ఐటీ కాన్సెప్ట్

విభిన్నమైన ఐటీ పాలసీతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఒరవడి సృష్టించింది. ఇందుకు ఆకర్షితులై ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్, యాక్సెంచర్, రాండ్‌స్టాడ్, డబ్ల్యూఎన్ఎస్, అమెజాన్ తదితర ఐటీ, ఐటీ అనుబంధ దిగ్గజ సంస్థలన్నీ విశాఖవైపు అడుగులు వేశాయి. వైఎస్సార్ హయాంలో పురుడు పోసుకున్న విప్రో సంస్థ.. ఎట్టకేలకు కార్యకలాపాలు విస్తరించేందుకు సిద్ధమవుతోంది. విశాఖలో స్టార్టప్‌ల ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నామంటూ నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్(నాస్కామ్) సీఈవో సంజీవ్ మల్హోత్రా ప్రకటించారు. ఐటీ పరిశోధనలు, అభివృద్ధిలో భాగంగా ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఎకో సిస్టమ్‌ని ఏర్పాటు చేయనున్నారు. అమెరికాకు చెందిన ప్రముఖ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ సంస్థ చెగ్.. విశాఖలో కొత్త బ్రాంచ్‌ని ప్రారంభించింది. భారత్‌లో ఢిల్లీ తర్వాత వైజాగ్‌లోనే చెగ్ సంస్థ బ్రాంచ్‌ని ఏర్పాటు చేయడం విశేషం. మిగిలిన ప్రధాన ఐటీ కంపెనీలు కూడా విశాఖలో ఏర్పాటయ్యేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

రాబోతున్న భారీ పరిశ్రమలివే..



- అదానీ డేటా సెంటర్ ఏర్పాటుకు సీఎం జగన్ స్వయంగా శంకుస్థాపన చేశారు. డేటా సెంటర్‌తో పాటు బిజినెస్ పార్క్, స్కిల్ యూనివర్సిటీ రూ.21,844 కోట్లతో ఏర్పాటుకానుంది. తద్వారా 39,815 మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.
- గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో ఎన్టీపీసీ, ఇంధన రంగంలో హెచ్‌పీసీఎల్, పర్యాటక రంగంలో ఒబెరాయ్, తాజ్, ఇనార్బిట్ మాల్, టర్బో ఏవియేషన్.. ఇలా.. విభిన్న రంగాల్లో బహుళ ప్రాజెక్టులను విశాఖ జిల్లాలోనే ఏర్పాటు చేసేందుకు పారిశ్రామిక వేత్తలు మొగ్గు చూపారు.

ప్రగతి పథంలో ఆంధ్రవిశ్వవిద్యాలయం



ఈ నాలుగేళ్లలో 18కి పైగా ప్రాజెక్టులను ఏయూలో పూర్తయ్యాయి. రూ.11 కోట్లతో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, రూ.40 కోట్లతో ఫార్మా టెస్టింగ్, ఇంక్యుబేషన్ సెంటర్, రూ.1.30 కోట్లతో స్టీల్‌ప్లాంట్‌తో సంయుక్తంగా హ్యూమన్ జెనిటిక్స్ విభాగంలో మెడికల్ జెనిటిక్స్ రీసెర్చ్ ల్యాబ్, ఏయూ–నాస్కామ్‌తో సంయుక్తంగా దాదాపు రూ 27 కోట్ల బడ్జెట్‌తో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, జియో ఇంజనీరింగ్ విభాగం సింగపూర్‌కు చెందిన సంస్థతో కలసి రూ.2 కోట్లతో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేస్తోంది. రూ.67.5 కోట్లతో ఎస్‌టీపీఐ ఆధ్వర్యంలో ఇంక్యుబేషన్, స్టార్టప్ ఎకో సిస్టం, ఆర్ట్స్ కళాశాల పరిధిలో ప్రత్యేకంగా రూ.5 కోట్ల వ్యయంతో డాల్బీ అట్మాస్ రికార్డింగ్ స్టూడియో, ఆ-హబ్ ఏర్పాటు చేశారు. 140కి పైగా సంస్థలు తమ సేవలు ప్రారంభించాయి.

గాజువాకకు పట్టాభిషేకం



కొన్ని దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న గాజువాక హౌసింగ్ సొసైటీ భూములకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత పరిష్కారం చూపించారు. గాజువాకలో ఎన్నో సంవత్సరాలుగా నివాసం ఉంటున్న తమ ఇంటిపై వారికి ఎలాంటి శాశ్వత హక్కులు లేవు. గత టీడీపీ దీన్ని ఎన్నికల ప్రచారానికి వాడుకోవడమే తప్ప పరిష్కరించలేదు. కానీ.. సీఎం వైఎస్ జగన్ జీవో నంబర్ 301 , 388 పట్టాదారులకు టైటిల్ డీడ్స్ అందజేశారు. సుమారు రూ.1,500 కోట్ల విలువైన భూమిని ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన అందజేశారు. గాజువాక హౌసింగ్ సొసైటీ ద్వారా ప్రభుత్వ ఆక్రమిత భూములలో నివాసం ఉంటున్న 7,026 మందికి కన్వేయన్స్ డీడ్స్ అందించారు. అదేవిధంగా 39 మంది ఉక్కు కర్మాగార నిర్వాసితులకు కన్వేయన్స్ పట్టాలు, 40 మంది ఫార్మాసిటీ భూ నిర్వాసితులకు ఇళ్ల పట్టాలందించి.. వారి జీవితాల్లో వెలుగులు నింపారు.

- ఈబీసీ నేస్తం పథకం కింద.. ఏటా 6,650 మందికి రూ.9.98 కోట్లు చొప్పున రూ.39.9 కోట్లు, కాపునేస్తం ద్వారా ఏటా 6,150 మందికి రూ.9.23 కోట్లు చొప్పున మొత్తం రూ.36.9 కోట్లు, జగనన్న చేదోడులో భాగంగా నాలుగేళ్లలో 57,776 మందికి రూ.57.78 కోట్లు పంపిణీ చేసింది.
- వాహన మిత్ర పథకం ద్వారా ఏటా 19,440 మంది ఆటోడ్రైవర్లకు నాలుగేళ్లలో రూ.77.76 కోట్లు, మత్స్యకార భరోసాలో భాగంగా ఏటా 10,026 మంది మత్స్యకారులకు నాలుగేళ్లలో రూ.40.1 కోట్లు జమ చేసింది.
- జగనన్న విద్యా దీవెనలో భాగంగా ఏటా 38,141 మంది విద్యార్థులకు నాలుగేళ్లలో రూ.169.52 కోట్లు, జగనన్న వసతి దీవెనలో భాగంగా ఏటా 45,236 మందికి నాలుగేళ్లలో రూ.16 కోట్లు జమ చేసింది.
- జగనన్న విద్యా కానుక కింద ఏటా 1.01 లక్షల మంది విద్యార్థులకు రూ.19.91 కోట్లతో కిట్లను అందజేసింది. నాడు–నేడు ద్వారా ఫేజ్–1లో 1131 పాఠశాలలను అభివృద్ధి చేసింది. ఫేజ్–2లో రూ.114.82 కోట్లతో 309 పాఠశాలలను అభివృద్ధి చేస్తోంది.
- రూ.34.80 కోట్లతో 102 శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తోంది.
- రూ.40.76 కోట్లతో 191 సామాజిక భవనాల నిర్మాణ పనులు ప్రారంభించగా.. ఇప్పటికే 83 భవనాలు పూర్తయ్యాయి. రూ.231.44 కోట్లతో 1387 డ్రైన్ల నిర్మాణ పనులు ప్రారంభించగా.. 858 ఇప్పటికే పూర్తి చేశారు.

నవరత్నాల పథకాల ద్వారా లబ్ధి పొందారిలా...

అమ్మ ఒడి..

సంవత్సరం	లబ్ధిదారులు	పొందిన లబ్ధి (రూ.కోట్లలో)
2019	1,95,442	293.16
2020	2,02,042	303.06
2021	1,75,065	262.60
2022	1,70,467	255.70
2023	1,69,987	250.86

జగనన్న తోడు..

విడతల వారీగా	లబ్ధిదారులు	రుణ మొత్తం (రూ.కోట్లలో)
1వ విడత	30,340	34.73
2వ విడత	24,566	28.89
3వ విడత	8579	8.58
4వ విడత	14,001	14.01
5వ విడత	8166	8.16
6వ విడత	16696	16.70
7వ విడత	22,753	24.31

క్లుప్తంగా

గంటలో 1,870 కిలోల వ్యర్థాల సేకరణ



సేకరించిన చెత్తతో స్కూబా డైవర్స్ టీమ్

కొమ్మాది: రుషికొండ సముద్ర గర్భంలోని వ్యర్థాలను ఆదివారం ప్లాటిపస్ ఎస్కేప్స్ స్కూబా డైవర్స్ టీమ్ ఆధ్వర్యంలో 11 మంది వలంటీర్లతో కలిసి గంటలో 1,870 కిలోల చెత్త సేకరించినట్లు డైవర్స్ టీమ్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్రన్ తెలిపారు. సముద్ర గర్భంలో ఉన్న దుస్తులు, ప్లాస్టిక్ వ్యర్థాలు, వైద్య వ్యర్థాలు సముద్ర జీవులను నాశనం చేస్తాయని, అందుకే ఎకో ఇండియా, ఎకో వైజాగ్, ఎకో బ్లూ, ఎకో క్లీన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పారిశ్రామిక వేత్త సిండ్రెల్లా పాట్నూరు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడితో ఏయూ విద్యార్థి ఆత్మహత్య

అల్లిపురం: మానసిక ఒత్తిడితో ఏయూ పీజీ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా, కొత్తూరు మండలం, పారాపురం గ్రామానికి చెందిన తంగుడు శివకాశీ ప్రసాద్ (22) ఆంధ్రాయూనివర్సిటీలో పీజీ 2వ సంవత్సరం చదువుతున్నాడు. ఏయూకు సెలవులు కావడంతో భానోజీనగర్‌లోని తన పినతల్లి ఇంటికి వచ్చాడు. శనివారం రాత్రి భోజనాలు చేసిన తరువాత నిద్రపోయిన అతడు ఆదివారం ఉదయం ఎంతకీ లేవకపోవటంతో గది తలుపులు తెరిచి చూశారు. ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు సోదరుడు కృష్ణతేజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

యోధుల మధ్య పోరు

- నేటి నుంచి విశాఖలో ఆల్‌ఇండియా పోలీస్ కమాండో పోటీలు
- ప్రారంభించనున్న రాష్ట్ర హోం మంత్రి వనిత
- 23 టాప్ కమాండో బృందాల పోటీ

విశాఖ స్పోర్ట్స్: అసాధారణమైన శక్తి సామర్థ్యాలతో శత్రుశ్రేణులపై పోరాడేందుకు ప్రత్యేక శిక్షణ పొందిన యోధుడే కమాండో. వారి శారీరక, మానసిక దృఢత్వం, వ్యూహాత్మక నైపుణ్యాలు, షూటింగ్ పరాక్రమం, నాయకత్వ లక్షణాల అంచనా వేసేందుకు ఏటా ఆల్‌ఇండియా పోలీస్ కమాండో (ఏఐపీసీసీ) పోటీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికి 13 ఎడిషన్స్ పూర్తి కాగా తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఆతిథ్యమివ్వనుంది. విశాఖలోని గ్రేహౌండ్స్ గ్రౌండ్స్‌లో సోమవారం నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజుల పాటు జరగనున్న పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల పోలీసుల బలగాలు, కేంద్ర సాయుధ బలగాలు పోటీపడనున్నాయి. దేశంలోని 23 ప్రత్యేక పోలీస్ బలగాల మధ్య పోటీలు జరగనున్నాయి. పోటీలను రాష్ట్రం హోం మంత్రి తానేటి వనిత ప్రారంభించనున్నారు.

ఐదు దశల్లో..

ఏఐపీసీసీ పేరిట విశాఖలో జరిగే పోటీల్లో దాదాపు 700 మంది కమాండోలు పోటీపడనున్నారు. వ్యక్తిగత పోటీలతో పాటు జట్టుగానూ పోటీలు జరగనున్నాయి. కమాండ్ కేటగిరీలో జరిగే పోటీలు దశల్లో జరుగుతాయి. ప్రతి దశలోనూ వ్యక్తిగా కాని దళంగా కాని పొందిన పాయింట్ల ఆధారంగా విజేతను ప్రకటిస్తారు. ఎలైట్ పర్వత శిక్షణ పొందిన ఫోర్స్ ఐటీబీపీ డిఫెండింగ్ చాంప్ హోదాలో బరిలోకి దిగనుంది. గతేడాది ఈ ఫోర్స్ మూడు వందల మార్కులకు గాను 262.85 పాయింట్లతో విజేతగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ 235.19 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. వ్యక్తిగత విభాగంలోని ఐదు దశల్లో మొత్తంగా వంద పాయింట్లకు గాను పోటీ ఉంటుంది.



ప్లాన్ బ్రీఫింగ్‌లో..

మానసిక శక్తి సామర్థ్యాల పోటీ

ఈసారి పోటీలను రాష్ట్ర గ్రేహౌండ్స్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.. పర్యవేక్షణ మాత్రం ఏఐపీఎస్‌సీ బోర్డ్ చేస్తోంది. బోర్డ్‌కు ఎక్స్‌అఫీషియో చైర్మన్‌గా ఐబీ డైరెక్టర్ ఉంటారు. ఆయన పదవీ కాలం రెండేళ్లు కాగా బోర్డు సభ్యులు ఆయనను ఎన్నుకుంటారు. ఈ పోటీల నిర్వాహణకు ప్రత్యేక శిక్షణ పొందిన టెక్నికల్ అఫీషియల్స్ ఉంటారు. వీరంతా సాయుధ బలగాల ఫోర్స్‌ల్లో నిష్ణాతులే.

ట్రోఫీలు ఇలా...

ఐదు దశల్లో పోటీలున్నా టీంలో ప్రతి దశలో ప్రతిభకు ట్రోఫీ ఉంటుంది. ఓవరాల్ ప్రతిభకు విజేతను నిర్ణయిస్తారు. బెస్ట్ పోలీస్ కమాండ్, బెస్ట్ స్టేట్ పోలీస్ ట్రోఫీ లుంటాయి. చీతా రన్ ట్రోఫీ, రణనీతి ట్రోఫీ, స్టాండ్ అలోన్ స్నైపర్ ఫైరింగ్, బ్లాక్ హాక్, చక్రవ్యూహ ట్రోఫీను అందిస్తారు. ఒక విధంగా ఏపీ కమాండో కాప్స్ అంచనా వేయడానికి ఈ పోటీలు దోహదపడతాయి.



పోటీలకు సిద్ధమైన గ్రేహౌండ్స్ గ్రౌండ్

ప్రతిష్టాత్మకంగా..



దేశంలోని 23 ప్రత్యేక దళాలకు చెందిన కమాండోలు పోటీపడుతున్నారు. పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నాం. సామర్థ్యం, నైపుణ్యం, ఓర్పుతో అత్యున్నత స్థానం పొందిన వారే విజేతలుగా నిలవనున్నారు. పోటీలు సజావుగా సాగేందుకు రక్షణ, సౌకర్యం, భద్రతకు ఉన్నత స్థాయి జాగ్రత్తలు తీసుకున్నాం. డీజీపీ కార్యాలయంతో పాటు సీపీ కార్యాలయం, రెవెన్యూ, జీవీఎంసీ చక్కటి తోడ్పాటు అందిస్తున్నాయి.

–మీనా, అడిషనల్ డీజీ

ఏయూలో సంబరాలు

- వీసీ ప్రసాదరెడ్డి నియామకంపై హర్షాతిరేకాలు
- థ్యాంక్యూ సీఎం సార్..వుయ్ లవ్ వీసీ సార్ అంటూ ప్లకార్డుల ప్రదర్శన

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి నియామకంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థిలోకం సంబరాలు చేసుకుంటోంది. తమ ప్రగతికి అనుణిత్యం పనిచేసే దార్శనిక ఆలోచనలు కలిగిన వ్యక్తి ఆచార్య ప్రసాద రెడ్డి ఏయూ వీసీగా రెండోసారి బాధ్యతలు చేపట్టడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏయూ కేవీ గోపాల స్వామి ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో విద్యార్థులు ఆత్మీయ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో వర్సిటీలోని ఏడు కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని నాలుగున్నరేళ్లుగా విభాగాలలో, కళాశాల పరిధిలో, హాస్టల్స్‌లో జరిగిన అభివృద్ధిని, తాము చూసిన వర్సిటీ ప్రగతిని వివరించారు. న్యాయ కళాశాల విద్యార్థిని హర్షిత దేవగుప్త మాట్లాడుతూ జాతీయ విద్యా సంస్థలకు దీటుగా ఏయూను అభివృద్ధి చేశారని చెప్పడానికి తాను గర్వపడుతున్నానన్నారు.సైన్స్ కళాశాల విద్యార్థిని ఆశ మాట్లాడుతూ తాను తమిళనాడు రాష్ట్రం నుంచి వచ్చానని, ఏయూలో ఉన్న వసతులు తాను మరెక్కడా చూడలేదన్నారు. ఈ సందర్భంగా ఆచార్య ప్రసాద రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని దీపిక మాట్లాడుతూ పూర్తి భద్రత కలిగిన హాస్టల్‌ను తమ కళాశాల ప్రాంగణంలో నిర్మించడంపై వీసీ ప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రసాదరెడ్డి కేక్ కట్ చేశారు. థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. వుయ్ లవ్ వీసీ సార్ అంటూ నినదించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య జి.శశిభూషణరావు, టి.శోభశ్రీ, ఎస్.కె భట్టి, టి.శోభశ్రీ, ఏ.నరసింహా రావు, కె.శ్రీనివాసరావు, వి.విజయలక్ష్మి, అకడమిక్ డీన్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, డీన్ ఆచార్య టి.షారోన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

వేమన సంఘం వినతికి ప్రభుత్వం నుంచి స్పందన

విశాఖ సిటీ: స్థల కేటాయింపు కోసం వేమన సంఘం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఇచ్చిన వినతిపై సీఎం కార్యాలయం స్పందించింది. ఇందుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఎంఏయూడీ, రెవెన్యూ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. వేమన సంఘం ప్రతినిధులు 1986లో ఆశీల్‌మెట్ట ప్రాంతంలో 1200 గజాల స్థలంలో వేమన మందిరం నిర్మించి లైబ్రరీతో పాటు పేదలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే 2006లో ఫ్లైఓవర్ నిర్మాణం కోసం వేమన మందిరానికి చెందిన 550 గజాలను జీవీఎంసీ సేకరించింది. అప్పటి నుంచి సేవలను మరింత విస్తృతం చేసేందుకు ప్రత్యామ్నాయంగా స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వానికి లేఖలు రాస్తూనే ఉన్నారు. తాజాగా సంఘం ప్రతినిధులు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనిపై సీఎం కార్యాలయం స్పందిస్తూ వేమన సంఘం వినతి మేరకు మధురవాడలో సర్వే నెంబర్ 96/7లో 1.45 ఎకరాలు, లేదా జీవీఎంసీ పరిధిలో 1.5 ఎకరాల స్థలాలను పరిశీలించాలని చెప్పింది. తమ వినతిపై సీఎం కార్యాలయం స్పందించడం పట్ల వేమన మందిరం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం జగన్ సభ స్థల పరిశీలన



మిందివానిపాలెంలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విజయనగరం జెడ్పీ చైర్మన్ చిన్న శ్రీను, ఉత్తర సమన్వయకర్త కేకే రాజు తదితరులు

తగరపువలస/ఆనందపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర నాయకులు, ప్రజాప్రతినిధులతో ఈనెల 27న నిర్వహించనున్న సభకు అనువైన స్థలం కోసం నాయకులు ఆదివారం పరిశీలన చేశారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విజయనగరం జెడ్పీ చైర్మన్ చిన్న శ్రీను, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు తదితరులు పర్యటించారు. సంగివలస జాతీయరహదారి పక్కన ఉన్న స్థలాన్ని, ఆనందపురం మండలంలోని శొంఠ్యాం పంచాయతీ పరిధిలోని మిందివానిపాలెం, పెద్దిపాలెం వద్ద గల స్థలాలను పరిశీలించారు. వాహన రాకపోకలు, పార్కింగ్ సదుపాయాలు, సీఎం రావడానికి వీలుగా హెలీపాడ్ తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని స్థలాలను పరిశీలించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు రానుండడంతో అందరికీ అనువుగా ఉండే స్థలాన్ని ఎంపిక చేస్తామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర యూత్ కో–ఆర్డినేటర్ ముత్తంశెట్టి శివనందీష్, ఆనందపురం, భీమిలి జెడ్పీటీసీ సభ్యులు కోరాడ వెంకటరావు, గాడు వెంకటప్పడు, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, ఆనందపురం పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు పాల్గొన్నారు.

ఎకో వైజాగ్ చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన



పోటీలో పాల్గొన్న చిన్నారులు

డాబాగార్డెన్స్: ఎకో వైజాగ్ చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన లభించింది. విశాఖను పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దే నేపథ్యంలో ఎకో వైజాగ్ మెగా ఆర్ట్ కాంటెస్ట్‌ను పోర్టు స్టేడియంలో జీవీఎంసీ, రేంజర్ ఫోర్స్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా నిర్వహించింది. విశాఖ అభివృద్ధిపై నగర వాసుల్లో పెరుగుతున్న సామాజిక స్పృహ ఎంతో స్ఫూర్తిదాయకమని నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. పోటీలను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ హరివెంకట కుమారి మాట్లాడుతూ.. రెండు వేల మందికిపైగా ఔత్సాహికులు పోటీలో పాల్గొని తమ సృజనాత్మకత చాటుకున్నారన్నారు. ఎకో వైజాగ్ అభివృద్ధి సాకారానికి ఇటువంటి పోటీలు నిర్వహించడం చాలా అవసరమన్నారు. నగర ప్రజల సహకారంతో జాతీయస్థాయిలో విశాఖ 4వ పరిశుభ్ర నగరంగా గుర్తింపు పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. కళాకారులు గీసిన చిత్రాలను ఎంపిక చేసి ఈ నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా నగదు బహుమతులు, అవార్డులు, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ నగరంలో పచ్చదనాన్ని పెంపొందిస్తూ పర్యావరణహిత విశాఖను రూపొందించుకోవడంలో అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ఎకో వైజాగ్ అభివృద్ధి సహకారానికి ఇంతటి సామాజిక స్పృహ లభించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. జీవీఎంసీ భాగస్వామ్యంతో చిత్రలేఖన పోటీలు నిర్వహించిన రేంజర్ ఫోర్స్ స్వచ్ఛంద సంస్థ స్థాపకుడు నాగేంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. పోటీల నిర్వహణకు ఆడిటోరియాన్ని ఉచితంగా అందించిన విశ్వనాథ గ్రూప్ చైర్మన్ కాశీ విశ్వనాథ రాజుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ పాపునాయుడు, ఎకో వైజాగ్ నోడల్ అధికారి, ప్రాజెక్టు అధికారి డి.లక్ష్మి, జీవీఎంసీ ఎస్ఆర్‌యూ కో ఆర్డినేటర్ శ్రీనివాస రాజామణి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులను అభినందిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్, జీవీఎంసీ కమిషనర్

నేడు తుది ఓటర్ల జాబితా విడుదల

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం తుది ఓటర్ల జాబితా–2024 విడుదల చేయనుంది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఫైనల్ పబ్లికేషన్ విడుదలకు సర్వం సిద్ధమైంది. కలెక్టర్ డా.మల్లికార్జున నేతృత్వంలో జిల్లా ఎన్నికల యంత్రాంగం ఇంటింట ఓటర్ల జాబితా పరిశీలన దగ్గర నుంచి పూర్తి పారదర్శకంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, డీఆర్వో మోహన్‌కుమార్ ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల నేతలతో సమావేశమై పార్టీల నుంచి వచ్చిన అభ్యంతరాల్ని పూర్తిస్థాయిలో పరిష్కరించారు. అదేవిధంగా డ్రాఫ్ట్ పబ్లికేషన్స్ తర్వాత వచ్చిన మొత్తం 2,64,314 అభ్యంతరాలు రాగా.. ఇప్పటివరకు 99 శాతం వరకూ పరిష్కరించారు. మిగిలిన ఒక్క శాతం అభ్యంతరాలు సాంకేతిక కారణాల వల్ల అపరిష్కృతమైనవిగా గుర్తించి పక్కన పెట్టారు. వచ్చిన ప్రతి అభ్యంతరాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన తర్వాత.. వాటిని పరిష్కరించామని జిల్లా ఎన్నికల అధికారి డా.మల్లికార్జున తెలిపారు. తుది ఓటర్ల జాబితా విడుదలైన తర్వాత ఉద్యోగుల బదిలీల ప్రక్రియపై దృష్టిసారిస్తామని వెల్లడించారు.

నేడు డయల్ యువర్ మేయర్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ మేయర్ కార్యక్రమం అనంతరం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం (స్పందన) నిర్వహించనున్నారు. డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో పాల్గొనదలచే వారు 1800 4250 0009 టోల్‌ఫ్రీ నంబరుకు నేరుగా మేయర్‌కు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఫోన్ చేసి సమస్యలు తెలపవచ్చు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు.

చిరుధాన్యాలతో 'అయోధ్య'

ఏయూక్యాంపస్: అయోధ్యలో జరుగుతున్న రామమందిర ప్రతిష్ట మహోత్సవాలను దేశవ్యాప్తంగా ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ చారిత్రక ఘట్టం జరుగుతున్న సందర్భాన్ని ఆధారంగా చేసుకుని నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ మిల్లెట్స్‌తో అయోధ్య రామమందిరం, శ్రీరామచంద్రుడి రూపాలను తీర్చిదిద్దారు. దాదాపు వారం రోజులుగా నిత్యం ఎనిమిది గంటలకు పైగా పనిచేస్తూ దీనిని తీర్చిదిద్దారు.



చిరుధాన్యాలతో అయోధ్య రామమందిరం

జై శ్రీరామ్..జైజై శ్రీరామ్

బీచ్‌రోడ్డు: అయోధ్య శ్రీరామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆర్కేబీచ్ వద్ద శ్రీరామ రథ యాత్రను రామ భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు ఉత్సాహంగా రథయాత్ర కొనసాగింది. జై శ్రీరామ్..జైజై శ్రీరామ్ అంటూ భక్తులు స్మరించారు.



రామస్మరణలో భక్తులు

అవగాహన కల్పించిన వాక్‌థాన్

బీచ్‌రోడ్డు: జాతీయ బాలికా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం చైల్డ్ రైట్ టు యూ సంస్థ ఆధ్వర్యంలో వాక్ టు ఎంపవర్ హర్ పేరుతో వాక్‌థాన్ నిర్వహించారు. ఆర్కేబీచ్ వద్ద ప్రారంభమైన వాక్‌థాన్‌ను పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ సీతామహాలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోని బాలికలు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు దురదృష్టకమరన్నారు. కార్యక్రమంలో నిర్వాహకుడు పీటర్ సునీల్, యంగ్ ఇండియన్స్ వైజాగ్ చాప్టర్ చైర్‌పర్సన్ హర్షనందన్, శ్రావణి సంధ్య, సీహెచ్ వంశీ, ఇంద్ర దీప్తి, సీహెచ్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



వాక్‌థాన్‌లో పాల్గొన్న నగరవాసులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



మారథాన్‌లో పాల్గొన్న నగరవాసులు



విజేతలతో నిర్వాహకులు

బీచ్‌రోడ్డు: వైజాగ్ అల్ట్రా పేరుతో ఆదివారం బీచ్ రోడ్డులోని నిర్వహించిన మారథాన్ ఉత్సాహంగా సాగింది. ఫుల్ మారథాన్, హాఫ్ మారథాన్, 10కే, 5కే, 3కే విభాగాల్లో మారథాన్‌ను నిర్వహించారు. నగరవాసులే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు కూడా ఉత్సాహంగా మారథాన్‌లో పాల్గొన్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి మెడల్‌తో పాటు గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే నరేంద్ర దేశద్రోహి

మధురవాడ: విజయవాడలో ఈ నెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని కూల్చివేస్తామని ప్రకటించిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రను కేంద్రప్రభుత్వం దేశద్రోహిగా ప్రకటించాలని భీమిలి నియోజకవర్గ ఎస్సీ సెల్ ఇంచార్జ్ సియ్యాద్రి కనకరాజు డిమాండ్ చేశారు. ఆదివారం బక్కన్నపాలెంలో అంబేడ్కరు విగ్రహం వద్ద దళిత నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహాన్ని కూల్చి మరో విగ్రహం నిర్మిస్తామని నరేంద్ర అనడం వెనుక ఏదో కుట్ర దాగుందన్నారు. టీడీపీ హయాంలో దళితులపై ఎన్నో దాడులు జరిగినా చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి దళితులంతా బుద్ధి చెపుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కుడితి రామారావు, నూకవరపు బాబ్జీ, బెల్లాన ప్రసాద్, గుంటుబోయిన సంజీవ్, జామి శివ, సింహాద్రి అప్పలరాజు, అప్పారావు, సాంబార్కి కనకరాజు, ఎస్.పైడమ్మ, ఎస్.కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.



మధురవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న దళితనాయకులు